క్లుప్తంగా

ఓటరు జాబితాలో అభ్యంతరాలు తెలపాలి


రాజకీయ పార్టీల నాయకులతో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు: మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీడీఓ సరిత, తహసీల్దార్ గోపాల్ ఆధ్వర్యంలో రాజకీయ పార్టీల నాయకులతో ఓటర్ లిస్టు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటుపై సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి గ్రామంలో వార్డు వారీగా ఓటర్ల లిస్టు తయారు చేశామని, అందులో ఏవైనా అభ్యంతరాలు ఉంటే లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయాలని సూచించారు. వచ్చిన అభ్యంతరాలను జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లి.. సవరించేందుకు కృషి చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీఓ గీత, పంచాయతీ కార్యదర్శులు, వివిధ పార్టీల అధ్యక్షులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం

మహేశ్వరం: ఆపదలో ఉన్న వారిని ఆదుకునేందుకు తనవంతు కృషి చేస్తానని తుమ్మలూరు మాజీ సర్పంచ్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మద్ది కరుణాకర్‌రెడ్డి అన్నారు. గ్రామానికి చెందిన నిదానకవి యాదగిరి కుటుంబానికి శనివారం రూ.పది వేల ఆర్థికసాయం అందజేశారు. యాదగిరి మృతితో విషాదంలో ఉన్న బాధితులను పరామర్శించారు.

సీపీఎం నాయకుల అరెస్ట్


సీపీఎం మండల కార్యదర్శి బాల్‌రాజ్‌ను అరెస్టు చేస్తున్న కానిస్టేబుల్

కందుకూరు: అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పలువురు సీపీఎం నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో కొన్నాళ్లుగా వీరు పోరాటం చేస్తున్న విషయం తెలిసిందే. శనివారం అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో వీరిని అదుపులోకి తీసుకుని పీఎస్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బుట్టి బాల్‌రాజ్ మాట్లాడుతూ.. పేదలు నివసించడానికి కనీసం ఇంటి స్థలం కూడా కేటాయించని ప్రభుత్వాలు ఎందుకు పాలన చేస్తున్నాయని విమర్శించారు. పేదల పక్షాన పోరాటం చేసే తమలాంటి వారిని అరెస్టులు చేయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కందుకూరు: మండలంలోని లేమూరు, గూడూరు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ వేణుగోపాల్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. లేమూరు సబ్‌స్టేషన్ పరిధిలోని లేమూరు, అగర్‌మియాగూడ, బైరాగిగూడ, మిర్చి ఫ్యాక్టరీ, నిషితా కాలేజ్ ప్రాంతాలు, గూడూరు సబ్‌స్టేషన్ పరిధిలో గూడూరు, మాలగూడూరు, బండమీద గూడూరు, కటికపల్లి, అన్నోజిగూడ, తిమ్మాయిపల్లి పరిధిలో 33 కేవీ లైన్లు మరమ్మతులు చేయడానికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు, రైతులు సహకరించాలని ఆయన కోరారు.

టీచర్లు, ఆయాల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

కందుకూరు: మండల పరిధిలోని 5 ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులను ప్రారంభించనున్నట్లు ఎంఈఓ నర్సింహా శనివారం తెలిపారు. మాధాపూర్, మాన్యగూడ ప్రాథమికోన్నత పాఠశాలలు, జైత్వారం, ఊట్లపల్లి, లేమూరు ప్రాథమిక పాఠశాలలను ప్రీ ప్రైమరీ తరగతుల నిర్వహణకు ఎంపిక చేసిందన్నారు. అందులో టీచర్లు, ఆయాలుగా పని చేయడానికి స్థానిక మహిళలను నియమించనున్నామని తెలిపారు. ఇంటర్‌మీడియట్ అర్హత గల వారు టీచర్లుగా, 7వ తరగతి చదివిన వారు ఆయాలుగా అర్హులన్నారు. సెప్టెంబర్ 6వ తేదీలోపు అర్హత గల మహిళలు ఎంఈఓ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

నాగోలు: ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన అవసరమని రాచకొండ ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ రాచపుడి తెలిపారు. శనివారం ఉప్పల్ సెయింట్ జాన్ స్కూల్ నుంచి 39 మంది విద్యార్థులు ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించగా రోడ్డు భద్రతా, నిబంధనల వీడియోలు ప్రదర్శించారు. వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 500 మంది వీటిని తిలకించారు.

ఘనంగా గణనాథుడికి పూజలు


మహేశ్వరం మండల కేంద్రంలో గణనాథుడి పూజలో పాల్గొన్న చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్, నాయకులు


మీర్‌పేట: పూజలో పాల్గొన్న కమిషనర్ నాగమణి, అధికారులు

మహేశ్వరం: మండల పరిధిలోని మహేశ్వరంలో ఏర్పాటు చేసిన గణనాథుడిని మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, మహేశ్వరం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సభావత్ కృష్ణానాయక్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాకలి యాదయ్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు యాచారం జంగయ్య, శివగంగ ఆలయ చైర్మన్ అల్లె కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కందుకూరులో..

కందుకూరు: మండల పరిధిలోని కందుకూరు, నేదునూరు, ఆకులమైలారం, మాన్యగూడ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల వద్ద గణనాథులకు శనివారం మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్ ప్రత్యేకంగా పూజలు చేశారు. ఆయన వెంట టీపీసీసీ సభ్యుడు దేప భాస్కర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యులు ఏనుగు జంగారెడ్డి, బొక్క జంగారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్.కృష్ణనాయక్, మాజీ వైస్ ఎంపీపీ జి.శమంతప్రభాకర్‌రెడ్డితో పాటు కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

'స్థానిక'ంలో సత్తాచాటుతాం


ఎమ్మెల్యే సబితారెడ్డి సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాగారం నాయకులు

- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి
- బీఆర్‌ఎస్‌లో పలువురి చేరిక

మహేశ్వరం: స్థానిక ఎన్నికల్లో బీఆర్‌ఎస్ సత్తా చాటుతామని మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. మండల పరిధిలోని నాగారం గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు, కార్యకర్తలు శనివారం ఆమె సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతూ రాజకీయ లబ్ధి పొందేందుకు ప్రయత్నిస్తోందన్నారు. కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలతో ప్రజలు విసుగు చెందారని తెలిపారు. ఈక్రమంలో ఆయా పార్టీలకు చెందిన మద్దతుదారులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని స్పష్టంచేశారు. త్వరలో జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఆయా పార్టీలకు గుణపాఠం తప్పదన్నారు. బీఆర్‌ఎస్‌ను వీడి ఇతర పార్టీల్లో చేరిన వారు మళ్లీ సొంత గూటికి వస్తున్నారని తెలిపారు. బీజేపీ నుంచి బీఆర్‌ఎస్‌లో చేరిన వారిలో నాయకులు బూర్గుల నవీన్ కుమార్, సుధాకర్, మహేందర్, నగేష్, బాల్‌రాజ్, నాగేష్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మంచె పాండు యాదవ్, బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు బండారి లింగం ముదిరాజ్, మాజీ ఉప సర్పంచ్ లతీఫ్ ఖాన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ రాజు, చాన్ పాషా, రఘు, రాజు, కుర్మ వెంకటేశ్ పాల్గొన్నారు.

ప్రీ ప్రైమరీ తరగతుల బోధకులకు ఆహ్వానం

మీర్‌పేట: త్వరలో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభించనున్నందున ఇంటర్ అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల (బోధకుల) నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు బాలాపూర్ మండల విద్యాధికారి కృష్ణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో జిల్లెలగూడ, అల్మాస్‌గూడ, బడంగ్‌పేట, కొత్తపేట, బాలాపూర్, వెంకటాపూర్ పాఠశాలలను ఎంపిక చేశారని, 4 సంవత్సరాల పైబడి వయస్సు ఉన్న విద్యార్థులు తరగతుల్లో ప్రవేశం పొందటానికి అర్హులని, ప్రతి పాఠశాలకు ఒక టీచర్, ఆయాను నియమిస్తున్నట్లు తెలిపారు. స్థానిక అభ్యర్థులు సెప్టెంబరు 6వ తేదీలోపు మల్లాపూర్‌లోని విద్యావనరుల కేంద్రంలో దరఖాస్తులు అందజేయాలని కోరారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు పూర్తి

కమిషనర్ నాగమణి


మంత్రాల చెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, పోలీసులు

మీర్‌పేట: నిమజ్జనం సందర్భంగా మంత్రాల చెరువు వద్ద భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేశామని కమిషనర్ నాగమణి తెలిపారు. శనివారం సాయంత్రం మంత్రాల చెరువు వద్ద పోలీసు, ట్రాఫిక్ అధికారులతో కలిసి కమిషనర్ నిమజ్జనాన్ని పరిశీలించారు. గతంలో కంటే ఈ సారి చెరువు వద్ద ఏర్పాట్లపై కమిషనర్ మున్సిపల్ సిబ్బందిని అభినందించారు. ఆమె వెంట ఏఎంసీ నాగేందర్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



మలక్‌పేట: డ్రగ్స్‌కు అలవాడు పడితే జీవితం అంధకారం అవుతుందని మలక్‌పేట ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ చెన్నయ్య అన్నారు. ఇంటర్మీడియేట్ విద్యా కమిషనర్ క్రిష్ణ ఆదిత్య ఆదేశాల మేరకు శనివారం విద్యార్థులకు డ్రగ్స్ నియంత్రణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ..మత్తు పదార్థాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని ఎలాంటి ఒత్తిళ్లకు గురి కాకూడదని, క్రమశిక్షణతో కూడిన జీవనం అలవర్చుకోవాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే శారీరక, మానసికంగా ఎన్నో సమస్యలు తలెత్తుతాయన్నారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, జక్కయ్య, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పదవీ విమరణ



మలక్‌పేట: తెలంగాణ గవర్నమెంట్ సెంట్రల్ ప్రెస్ రీడింగ్ విభాగం ఏజీఎం, ఏఐటీయూసీ జనరల్ సెక్రటరీ మర్రి రవీందర్‌రెడ్డి పదవీ విరమణ చేశారు. శనివారం అక్బర్‌బాగ్ డివిజన్‌లోని గవర్నమెంట్ ప్రెస్ బైడింగ్ సెక్షన్‌లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అధికారి మురలీకృష్ణ హాజరై మాట్లాడారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తూనే, కార్మిక సంఘం నాయకుడిగా 37 సంవత్సరాలు సేవలు అందించారన్నారు. ప్రెస్‌లోని ఆయా విభాగాలకు చెందిన కార్మికులు ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసరావు, యూనీస్ అహ్మద్, సిబ్బంది పాల్గొన్నారు.

రక్షణ గేట్ల తొలగింపును అడ్డుకున్న కాలనీవాసులు


అధికారులను అడ్డుకున్న కాలనీవాసులు

సైదాబాద్: ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతీ నగర్ కాలనీ ఆదర్శకాలనీగా పోలీస్‌శాఖ అధికారులతో గుర్తింపు పొందింది. కాలనీలో తరచూ చోటు చేసుకుంటున్న నేరాలు తగ్గించటానికి, కాలనీవాసుల రక్షణ కోసం 2011లో కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కాలనీకి సరిహద్దులో 8 రక్షణ గేట్లను ఏర్పాటు చేసి ఓ వాచ్‌మెన్‌నూ నియమించారు. రక్షణ గేట్లను రాత్రి 11 గంటల నుంచి ఉదయం 5 గంటల వరకు మూసి వేస్తారు. అలాగే కాలనీ మొత్తం సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేసారు.దీంతో ఐదు సంవత్సరాల క్రితం సరస్వతీనగర్ కాలనీని నగర పోలీస్ కమిషనర్ ఆదర్శ కాలనీగా గుర్తించి ప్రశంసించారు. అయితే ఈ కాలనీ రక్షణ గేట్ల ద్వారా తనకు ఇబ్బందిగా ఉందని వేరే కాలనీకి చెందిన వ్యక్తి న్యాయస్థానాన్ని ఆశ్రయించాడు. కోర్టు ఆదేశాల మేరకు టౌన్‌ప్లానింగ్ అధికారులు శనివారం సంతోష్ నగర్ సర్కిల్ టౌన్‌ప్లానింగ్ ఏసీపీ సిబ్బంది, ఒక జేసీబీతో గేట్లను తొలగించడానికి కాలనీ వద్దకు చేరుకున్నారు. విషయం తెలుసుకున్న కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు అక్కడికి చేరుకున్నారు. న్యాయస్థానంలో మా వాదనలు కూడా వినిపిస్తామని, కాలనీవాసుల సంక్షేమం కోసమే గేట్లు ఏర్పాటు చేశామని వెంటనే వెనుదిరగాలని కోరడంతో చేసేదేమి లేక టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ప్రభాకర్‌రెడ్డి, చెన్నారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్ గుప్తా, వినోద్, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

ఏఐఎన్‌యూలో అరుదైన శస్త్రచికిత్స


వైద్యులు సుభాష్‌చంద్రబోస్, శ్రీనివాస్

సాక్షి, సిటీబ్యూరో/మలక్‌పేట: పారాథైరాయిడ్ అడినోమా అనే అరుదైన సమస్యతో తరచు కిడ్నీలో రాళ్లు ఏర్పడే అవకాశం ఉందని ఏఐఎన్‌యూ వైద్యుడు సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. ఒక దఫా తొలగించినా మళ్లీ వస్తున్నాయని ఇలాంటి కేసుకు సంబంధించిన వివరాలను శుక్రవారం వెల్లడించారు. సరూర్‌నగర్ ప్రాంతానికి చెందిన 29 ఏళ్ల యువతికి పదేపదే కిడ్నీలో రాళ్లు ఏర్పడుతున్నాయి. వైద్య పరీక్షలు నిర్వహించగా ఆమెకు మెడలో పారాథైరాయిడ్ ఎడినోమా అనే కణితి కారణంగా ఇలా జరుగుతోందని గుర్తించామన్నారు. దీని వల్ల పారాథైరాయిడ్ హార్మోన్ అధికంగా ఉత్పత్తి అవుతుంది, రక్తంలో క్యాల్షియం స్థాయి పెరిగిపోతుంది. ఫలితంగా కిడ్నీలో మళ్లీమళ్లీ రాళ్లు ఏర్పడి మూత్రం బయటకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయన్నారు. ఇది చాలా విభిన్నమైన కేసు అని శస్త్రచికిత్సలతో దశలవారీగా రాళ్లకు తొలగించామన్నారు.

రహదారులపై నీరు ఆగకుండా చర్యలు

చైతన్యపురి: కాలనీల్లోని రహదారులపై వర్షపు నీరు ఆగకుండా చర్యలు తీసుకుంటున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి అన్నారు. చైతన్యపురి డివిజన్ పరిధి దిల్‌సుఖ్‌నగర్ కమ్యూనిటీ హాల్ వద్ద జరుగుతున్న వరదనీటి డ్రైన్ పనులను శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. గతంలో చిన్నపాటి వర్షానికే బస్ డిపో నుంచి రాజధాని థియేటర్ పరిసర ప్రాంతాల్లో వర్షపు నీరు రహదారిపై ప్రవహించేదన్నారు. డ్రెయిన్ లైను చిన్నదిగా ఉన్న ప్రాంతాల్లో ఆధునీకరించి వెడల్పు చేయటం జరుగుతందన్నారు. ఈ పనులు పూర్తయితే సమస్యల శాశ్వతంగా పరిష్కారం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో తోటమహేష్ యాదవ్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజేశ్వర్, రోజా, పద్మిని, భాస్కర్ పాల్గొన్నారు.


కాలువ పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి


కందుకూరులో మాట్లాడుతున్న ఎమ్మెస్పీ నాయకులు

పింఛన్లు పెంచాలి

- ప్రభుత్వం పేదలను పట్టించుకోవడం లేదు
- ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు బాబుమాదిగ

కందుకూరు: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు లబ్ధిదారుల పింఛన్లు పెంచాలని ఎమ్మెస్పీ జిల్లా అధ్యక్షుడు రావుగళ్ల బాబుమాదిగ, ఉపాధ్యక్షుడు బక్కని రవిమాదిగ డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఆయా సంఘాల నాయకులతో సమావేశమై మాట్లాడారు. వృద్ధులు, వితంతువుల పెన్షన్‌ను రూ.2 వేల నుంచి రూ.4 వేలు, దివ్యాంగులకు రూ.6 వేల చొప్పున పెంచుతానని సీఎం రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చి 20 నెలలు గడుస్తున్నా ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. భూములు ఉన్నవారికే రైతుబంధు, రైతు భరోసా పేరుతో డబ్బులు ఖాతాల్లో జమ చేస్తున్నారని విమర్శించారు. పేదలను పట్టించుకోవడంలేదని ఆవేదన వ్యక్తంచేశారు. పెన్షన్‌దారుల పక్షాన పోరాటం చేయడానికి సెప్టెంబర్ 8న మంద కృష్ణమాదిగ కందుకూరుకు వస్తున్నారని, ఫించన్‌దారులు తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు మస్కు బాబుమాదిగ, మంద సాయిలు, నాయకులు కుమార్‌మాదిగ, మంద నరసింహ, ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు గండిపేట జంగయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మల్లేపల్లి కృష్ణ, వీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు జంగయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేష్, నాగార్జున, నాయకులు ఎర్ర గణేశ్, అందుగుల కృష్ణ, కంద పెద్ద నరసింహా, ముచ్చర్ల నరసింహా, పి.జంగయ్య, పి.రాములు, కె.వెంకటేశ్, జి.వెంకటయ్య, డాక్టర్ జంగయ్య, నవీన్, మల్లేష్, నర్కుడ అర్జున్, రాము, భిక్షపతి, నరసింహా, యాదయ్య, కృష్ణ, అంజయ్య, నవీన్ పాల్గొన్నారు.

విద్యార్థులకు అచీవ్‌మెంట్ అవార్డులు


అవార్డులతో విద్యార్థులు

బడంగ్‌పేట్: మాస్టర్‌మైండ్ బడంగ్‌పేట్ జూనియర్ కళాశాల విద్యార్థులు శనివారం మాస్టర్‌మైండ్ కన్‌ఫ్లూనెన్స్-25 పేరుతో ఫ్రెషర్స్ డే వేడుకలను తిరుమల గార్డెన్‌లో నిర్వహించారు. ఈ వేడుకల్లో కళాత్మక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు వేడుకకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ముఖ్య అతిథులుగా ప్రముఖ విద్యావేత్త జి.వేణుగోపాల్ రెడ్డి, సక్సెస్ గ్రూప్ అండ్ కాలేజీల చైర్మన్ డా.పార్థసారధి, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ వి.ప్రదీప్‌కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, లక్ష్యసాధనపై దృష్టిపెట్టాలని సూచించారు. అలాగే ఆన్‌లైన్ గేమ్స్, బెట్టింగ్ ప్రకటనలు, పోక్సో చట్టాలపై అవగాహన, టెక్నాలజీ పెరుగుదలతో విద్యార్థులపై పడుతున్న ప్రభావాలు తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన పరిచారు. పోటీ పరీక్షలో మెరిసిన విద్యార్థులకు అకాడమిక్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో కాలేజీ చైర్మన్ డా.జగన్‌మోహన్ రావు, సెక్రటరీ డా.పాండు రమావత్, డైరెక్టర్లు నాగేంద్ర, లక్‌పతి, బాలాజీ, ప్రిన్సిపాల్స్ శ్రీనివాస్‌రెడ్డి, నవనీత, కాలేజీ హెడ్స్ శ్రీధర్‌రెడ్డి, సుధాకర్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అరెస్టులు అప్రజాస్వామికం

- ప్రజా సమస్యలపై నిలదీస్తారనే నిలువరింపు
- సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సామేల్


పట్నం రాణా ఆవరణలో సీపీఎం నేతలు

ఇబ్రహీంపట్నం: అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో ప్రజా సమస్యలపై నిలదీస్తారనే భయంతోనే.. ప్రతిపక్ష పార్టీల నేతలను ప్రభుత్వం అరెస్టు చేయించిందని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు సామేల్ ఆరోపించారు. ఇది అప్రజాస్వామికమన్నారు. శనివారం తెల్లవారుజామున సీపీఎం నేతలను పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాసనసభ సమావేశాలు జరిగిన ప్రతిసారి.. ఏ ప్రభుత్వం ఉన్నా ఇలాగే చేయిస్తుందని విమర్శించారు. రేవంత్ సర్కార్.. ప్రజా సమస్యలను విస్మరించిందన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. అరెస్టు అయిన వారిలో పార్టీ మండల కార్యదర్శి బుగ్గరాములు, స్వప్న, అరుణ, యాదగిరి, దశరథ, బాలరాజ్, పుష్ప, కాంతమ్మ, బాలమణి, మణెమ్మ, భారతమ్మ ఉన్నారు.

చెరువు, కుంటల పరిశీలన

కడ్తాల్: చెరువులు, కుంటలపై పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో ఎలిగకుంట, దేవర చెరువు, కుమ్మరికుంట, గుర్లకుంట, పెద్దికుంటలను శనివారం తహసీల్దార్ ముంతాజ్, ఇరిగేషన్ డీఈఈ నరేందర్‌రెడ్డి ఏఈ మహేందర్‌రెడ్డిలు పరిశీలించారు. వాటికి సంబంధించిన భూముల్లో ఎలాంటి కట్టడాలు లేనప్పటికీ.. పూర్తిస్థాయిలో సర్వే చేయనున్నామని తెలిపారు. అనంతరం హద్దురాళ్లను ఏర్పాటు చేయిస్తామని పేర్కొన్నారు. ఆక్రమణలకు గురైనట్లు తేలితే సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో రైతులు రవీందర్‌రెడ్డి, భూమయ్య, సర్వేయర్లు శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

స్థలాల పంపిణీలో చిత్తశుద్ధిలేని సర్కార్



తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం శ్రేణులు

- పేదలకు ఇంటి స్థలం కేటాయించాలి
- సీపీఎం మండల కార్యదర్శి నర్సింహా
- తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

యాచారం: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసే విషయంలో సర్కార్‌కు ఏ మాత్రం చిత్తశుద్ధి లేదని సీపీఎం మండల కార్యదర్శి ఆలంపల్లి నర్సింహ ఆరోపించారు. చింతపట్ల గ్రామంలో 2004లో సర్వే నంబరు 208, 209, 210లో పేదల కోసం కొనుగోలు చేసిన రెండు ఎకరాల పది గుంటల భూమిలో వారికి స్థలాల ఇవ్వాలని డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇరవై ఏళ్ల క్రితం కొనుగోలు చేసి, ఇంత వరకు కేటాయించకపోవడం సరైంది కాదని పేర్కొన్నారు. ఎస్సీ కుటుంబాల్లో ఎంతో మంది స్థలాలు లేక ఇందిరమ్మ ఇళ్లు పొందలేక పోతున్నారన్నారని తెలిపారు. ఇదే విషయమై కలత చెందిన ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన విషయం తెలిసిందేని చెప్పారు. పేదల కోసం కొనుగోలు చేసిన భూమిలో లేవుట్ వేసి, పంపిణీ చేయాలని కోరారు. లేని పక్షంలో సీపీఎం ఆధ్వర్యంలో ఆ భూమిని స్వాధీనం చేసుకొని, అర్హులకు అందజేస్తామని స్పష్టం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ అయ్యప్పకు అందజేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకుడు మధుసూదన్‌రెడ్డి, జిల్లా కమిటీ సభ్యుడు అంజయ్య, మండల కార్యవర్గ సభ్యుడు ఆలంపల్లి జంగయ్య, బ్రహ్మయ్య, చందునాయక్, నాయకులు వెంకటయ్య, సత్యం, గిరికాంత్, నర్సింహ, రమేష్, కృష్ణ, జంగయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.